# గోరింటాకు! - గోంగూర పచ్చడి!

నా శ్రీమతికి గోరింటా కన్నా... గోంగూర పచ్చడన్నా... మహా ఇష్టం! ఇవంటే పడి చస్తుందంటే నమ్మండి! దాని శరీర ఛాయ ఇంచుమించు వీటి రంగులోనే వుంటుంది!... ఇదే మాట నేనంటే... నామీద విరుచుకుపడుతుందంతే!.. తెలుగు... ఇంగ్లీషే కాదు భారతీయ భాషలన్నీ కలగా పులగం చేసిన తెలుగు సినీమా పాటలా వుంటయ్ దాని తిట్లు!- తిట్టి తిట్టి అలిసిపోయి వంట చేయటం మానేస్తుందీ. ఆరోజంతా పస్తే!

శ్రీమతి పుట్టిల్లు ఓ పల్లె! ఆ వూళ్లో బాగా ఆస్తిపాస్తులున్న కుటుంబం వీరిదే! పెద్దలోగిలి కొంప! ఇంటి చుట్టూ బోలెడంత ఖాళీ స్థలం! దొడ్లో గోరింటాకు చెట్ల పెంపకం ఓ చిన్న సైజు కుటీర పరిశ్రమలాగ వుంటుంది. పాతిక ఎకరాలు మాగాణి పొలం. మరో పదెకరాలు మెట్టనేల కావటాన... కందులు... పెసలు.. మినుమలు... పండిస్తుంటారు. ప్రత్యేకంగ ఒక ఎకరంలో గోంగూర నారు వేసి మొక్కలు ఎదగ్గానే సంచులకెత్తి అమ్మకానికి మార్కెట్‌కి తరలిస్తూంటారు. సంవత్సరం పొడుగునా చేలో గోంగూర పంట కంటికి కన్పిస్తూంటూంది.

అత్త వారింట్లో గోంగూర వూరగాయ (ఉప్పు పచ్చడి) ఏటికేడాది సమృద్ధిగా వుంటుంది. ఇంటికి వచ్చి పోయే బంధువులకూ పచ్చి గోంగూర మూట కట్టి ఇచ్చి పంపటం అలవాటు.

మా మామగారి చేలో గోంగూర పులుపులొడ్డు! ఎక్కడెక్కడివాళ్లు వాళ్ల చేలో గోంగూర కోసం ఎగబడుతూంటారు.

నాభార్య ఒక్కతే సంతానం! గారాబంగ పెరిగింది. ఎలిమెంటరీ స్కూలు చదువు చాలని బడి మాన్పించేశారు. చదవటం.... రాయటం వస్తే చాలనుకున్నారు.

ఊహ తెలిసిన నాటి నుండి దొడ్లో గోరింటాకు కోయించి రుబ్బించి ముద్దుగ ఒడిలో కూర్చోపెట్టుకుని చేతులకు కాళ్లకు గోరింటాకు పెట్టేదిట మా అత్తగారు.

నిత్య పెళ్లి కూతురిలా రెండు చేతులూ ఏడాది పొడవునా ఎఱ్రగా వుండాల్సిందే! కాళ్లకు పారాణి పెట్టినట్టు గోరింటాకు పెట్టించుకుని... రోజూ పూల జడవేయించుకుని తెగమురిసేదట నా శ్రీమతి.

చదువు సంధ్య లేకపోవటంతో ఇరుగు పొరుగు పిల్లలతో తొక్కుడు బిళ్ల... చెమ్మ చెక్క... ఉప్పులకుప్ప ఆటల్లాంటివి ఆడుకునేది.(ఈ విషయం నా శ్రీమతే చెప్పింది)

ఇక కంచం ముందు కూర్చుంటే... మొదటి ఐటమ్ అన్నంలో కలుపుకునేది గోంగూర వూరగాయె! అది తినందే ముద్ద ముట్టదు.

గోంగూర పచ్చి లేదూ ఊర బెట్టిన ఆకుతో పాతిక రకాలు పచ్చళ్లు చేస్తుంది మా అత్తగారు. రోటి పచ్చడికి ఆమె చెయ్యి తగిల్తే అద్భుతమైన రుచి! ఒక్క సారి రుచి చూచినవాళ్లు... ఆ రుచిని జీవితాంతం మర్చిపోలేరు. గోంగూర పచ్చళ్లు రకరకాలుగా నూరటంలోనూ అత్తగారు ఆమెకామే సాటి!

ఇంట్లో జాడీల కొద్దీ ఇతర వూరగాయలునపప్పటకీ... గోంగూరకే ఎక్కువ డిమేండు! మిగతావి వచ్చిపోయే చుట్టాల కోసం!

శ్రీమతికి గోంగూర పచ్చడి పళ్లెంలో కన్పించకపోతే గంగవెర్రు వెత్తినట్టు చిందులేస్తుంది! కంచాన్ని కాలితో తన్ని పారేస్తుంది. భోజనం చేయనంటూ అలక!.

గోంగూర పికిల్ గాని రోట్లో నూరే పచ్చడిగాని కేవలం భోజనంలోకే పరిమితం కాదనేది మా అత్తారింట్లో తెలిసి ఆశ్యర్యపోయాను.

ఇడ్లీ... దోసె... ఉప్మాలాంటి ఐటమ్సులో క్కూడా గోంగూరే నంజుడికి చట్నీ! పెళ్లి అయిన కొత్తల్లో ఇది చూచి విస్తుపోయాను. టిఫిన్‌లోకి మరో రకం చట్నీ చేయటం మా అత్తగారికి చేతనై చావదు. ఆ కారణంగానే గోంగూరను రకరకాల రుచుల్లో తయారు చేసి వడ్డిస్తుందామె! కొత్తల్లో... నాకు వింతగాను... అయిష్టంగానూ అన్పించినా రుచి చూచేక గోంగూర పచ్చడి అద్భుతమన్పించింది.

రకరకాలుగ విభిన్న రుచుల్లో తయ్యారు చేసిన గోంగూర పచ్చళ్లు తినమని నా ప్రాణం తీసేవారు అత్తగారు నా శ్రీమతి తాయారు.

అసలు గోంగూరంటేనే ఎలర్జీ! నా వంటికి పడి ఏడవదు. అలాంటి నాకు అత్తవారింట భోజనంలో సగం గోంగూర ఐటమ్సుతో తినాల్సి వచ్చినందుకు తెగ బాధపడాల్సి వచ్చేది. వద్దని బీష్మించుకుంటే ఏమైనా అనుకుంటారేమోని ఒకటి రెండు ముద్దలు గోంగూర చట్నీతో తినక తప్పేది కాదు.

మా ఇంట్లో తిండి విషయానికొస్తే అందరికీ గోంగూర పట్ల విముఖతే!

డాడీ మార్కెట్‌కెళ్ళినప్పుడల్లా ఎన్ని రకాల ఆకుకూరలు... కాయగూరలు తెచ్చినా పొరపాటున కూడా గోంగూర తెచ్చేవాడు కాదు. మా తాతయ్యగారు గోంగూరను కాశీలో వదిలిపెట్టేశారట! అప్పట్నించి ఇంటిల్లిపాదీ గోంగూరకు దూరం! దాన్ని ముట్టరు! దాన్ని ఇంటికి తేవటం బంద్! తినటం బంద్!

బంధువులెవరైనా ఇంటికొస్తే... భోజన సమయంలో 'కాస్తంత గోంగూర పచ్చడి వడ్డిద్దూ....' అనడిగితే మా ఇంట్లో ఆ పదార్థం నిండుకున్నదని కొందరికి నిషిద్ధమంటూ మరి కొందరికి మమ్మీ సున్నితంగ చెప్పటం తెలుసు.

శ్రీమతి కాపురానికొస్తూ నాలుగు జాడీల నిల్వవుంచిన గోంగూర ఊరగాయాల వెంట తెచ్చుకుంది. ఇంట్లో వారెవ్వరూ దాన్ని ముట్టరనే విషయం గ్రహించినా తనక్కావలసింది తాను రోట్లో నూరుకుని ఓ చిన్న జాడీలో పెట్టుకుని (దాచుకుని) తనుమాత్రం బహిరంగంగానే భోజనంలో వేసుకుని లొట్టలేస్తూ తినేది.

కొత్త కోడలను ఏమీ అన్లేక గుడ్లుమిటకరించే వారం!. మా సరసన కూర్చుని శ్రీమతి అన్నంలో నూరిన గోంగూర పికిల్ కలుపుకు తింటూంటే దాని వాసన ఆఘ్రాణించటం ఇష్టం లేక... మా వంటికి సరిపడకపోవటాన... ఫ్యామిలీ మెంబర్స్‌తో కాకుండా విడిగా శ్రీమతికి ఒక్కదానికీ వడ్డించేది మా అమ్మ.

కనీసం నాతో పాటైనా భోజనానికి కూర్చుంటాననంటూ మొండికేసేది తాయారు. అది గోంగూర చట్నీయే కాదు చివరకు గడ్డి చట్నీ తిన్నా దాని సరసన కూర్చుని నేనూ భోజనం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

గోరింటాకు ఇరుగు పొరుగువారి దొడ్లలోకెళ్లి స్వయంగ కోసుకొచ్చితానే రోట్లో ఆకు మజ్జిగ చుక్క కాస్తంత చింతపండువేసి రుబ్బుకుని వేళాపాళా... సమయం సందర్భం లేకుండా చేతి వేళ్లకు కాళ్లకు పెట్టుకునేది.

× × × × ×

నాలుగేళ్లు గుంటూరులో చేశాక అనుకోకుండా నన్ను హైదరాబాద్ హెడాఫీస్‌కు ట్రాన్స్ఫర్ చేయటంతో ముందు నేను వంటరిగా వెళ్లి జాయినై ఓ సింగిల్ పోర్షన్ ఒక ఇంట్లో అద్దెకు తీసుకుని లగేజీతో పాటు శ్రీమతి నీ సిటీకి తెచ్చాను.

ఒంటరి కాపురం కావటాన శ్రీమతిను మరీ బరి తెగించింది. తనకు

అనేవారు అడ్డుకునేవారు లేకపోవటంతో దాని ఇష్టారాజ్యంగ వ్యవహరించటం మొదలైంది. అత్తపోరు ఆడపడుచుల ఆదిలింపు మామగారి కంట్రోల్ లేకపోవటంతో మరీ రెచ్చిపో సాగింది. ఇష్టమైనవి కావలసినవి అన్ని రకాలు చేసుకు మింగుతూ నాపై పెత్తనం చెలాయించ సాగింది.

నా సంగతి సరే సరి. అదేం చేసినా ఎట్లా చేసినా నోరెత్తే అలవాటు లేదు. నోరు మూసుకుని అదేంపెడితే అది తినేయటమే నావంతు!

అదృష్ట మేమిటంటే తనను అక్కడికి తీసుకెళ్లు ఇది చూపించు... అది కావాలి... ఇది కావాలనే సతాయింపు లేకపోవటంతో బ్రతికి పోతున్నాను. ఎక్సెప్ట్ గోంగూర ఐటమ్ శ్రీమతి ఏం వండిపెట్టినా తినేస్తాను. నో అబ్జక్షన్!

నేను రైతు బజారుకెళ్లొచ్చాక కూరల సంచి దిమ్మరించి 'ఏడిసినట్టేవుంది!... ఇన్ని కూరలు తెచ్చారు గానీ... నాకిష్టమైన గోంగూరేది?-' ఏడుపు ముఖం పెట్టి నిలదీసింది.

'ఇది హైదరాబాదే! ఇక్కడ మన వైపులాగ గోంగూర దొరికేడవదు....' నొసలు చిట్లించాను.

నామాట మీద నమ్మకం కుదర్లేదేమో తాయరు రుసరుసలాడింది. దాని సీరియస్ చూపులు నన్ను ఇబ్బందిపెట్టినయ్. నిందితుడిలా తలొంచుకోవలసి వచ్చింది. నేను ఎన్ని విదాలుగా నచ్చ చెప్పి చూచినా... గోంగూర తేనందుకు నన్ను రోజంతా సాధిస్తూనే వుంది.

దీనితో సిటీలో కాపురం చేయటం కష్టమే అన్పించింది! తానొచ్చి నలభై ఎనిమిది గంటలైనా కాకముందే.. 'ఏమండీ... గోరింటాకు తేరూ?-' గోముగ అడిగింది.

చచ్చాన్రా దేవుడోయ్! ఇంకా అడగలేదేమానుకుంటుండగా... గోరింటాకు బాంబు పేల్చింది.

ఏం చెప్పాలో తోచక బుర్రగోక్కుంటూ 'ఇది మనవూరు కాదే. మనం కోరుకునేవేవీ దొరికి చావవ్!-' నచ్చచెప్పబోయాను.

'ఏడిసినట్టే వుంది. ఇదేం సిటీ అండి... వెధవది.... దరిద్రపుగొట్టు సిటీ!... దరిద్రపుగొట్టు సిటీ!- గోరింటాకు... గోంగూర దొరక్కపోతే ఎలా? - నాకు సిటీ వ్యవహారం బొత్తిగ నచ్చలేదు - మనం ఈ సిటిలో వుండద్దు! మన వూరు మనం

వెళ్లిపోదాం! వెంటనే బదిలీ చేయించుకురండి సాయంత్రం ఆఫీసు నుండి వస్తూ... నేనీలోగా మూట ముల్లె సర్దివుంచుతాను! నాకిక్కడ ఒక్క క్షణం కూడా వుండాలన్పించటం లేదు సుమా...!" దులిపేసింది.

'సిటిలో అన్నీ అపార్ట్‌మెంట్సేనే!- వాకిలి ముందు వెనుక ఖాళీ స్థలం వుండదే గోరింటాకు గోంగూర మొక్కలు పెంచుకోవటానికి...' నాకు తెల్సింది మాట్లాడాను దాన్నోరుమూయించాలని.

'కాకమ్మ కబుర్లు చెప్పకండి! రేపీపాటి కల్లా మనం గుంటూర్లో వుండాలంతే....'

'ట్రాన్స్ఫరంటే నువ్వు అన్నంలో గోంగూర కలుపుకుని ముద్దలు మింగినంత ఈజీ కాదే! కనీసం మూడేళ్లయినా పూర్తి కానిదే ఇక్కడ్నించి కదల్చరు తాయారూ... అన్నట్టు, ఇక్కడ పచ్చి గోరింటాకు కరువైనా... రుబ్బిన గోరింటాకు 'కోన్స్' అమ్ముతారని విన్నాను... దాన్ని తెస్తాలే వస్తూ...'

'ఏదోటి తెండి! నాకు రుబ్బే చాకిరైనా తప్పుతుంది... రాత్రికి ఎట్టి పరిస్థితుల్లోనూ నేను గోరింటాకు చేతికి కాళ్లకు పెట్టుకోవాలి!'... తీసుకురాయకపోయారో.. నేను వంట చేసేది లేదు... ఇద్దరం పస్తే...!

'వామ్మో! అలాంటి శపథాలు చెయ్యకు! నేనసలే ఆకలి మనిషిని!. పస్తుంచావంటే నీకు పసుపు కుంకుమలు దూరమైపోతయ్... సిటీ అంతా గాలించైనా సరే నీకు మెహిందీ కోన్లు ఓపాతిక కొనుక్కొచ్చి పడేస్తాలే...' నాలో తన్నుకొస్తున్న విసుగు... కోపాన్ని ప్రదర్శించకుండా నచ్చజెప్పే ప్రయత్నంలో మాట్లాడటంతో తాయరు కాస్త మెత్తబడింది

× × × × ×

'ఏమండీ!... రేపు అట్లతద్ది! మీరు ఆఫీసుకు సెలవు పెట్టి ఇంట్లో వుండాలి' భోజనం వడ్డిస్తూ అంది తాయారు.

'ఆడవాళ్ల పండుగకు నేనెందుకు లీవు పెట్టాలిట?-' తలెత్తి శ్రీమతి ముఖంలోకి చూశాను..

'పండుగ మా ఆడవారిదే అయినా... మీ మగాళ్లు చేయాల్సిన పని భోళెడుంటుంది...'

'ఏ... నా...?' నోరు భార్లగా తెరిచాను.

'మీది మరి బడాయి! నాకు గోరింటాకు చేతులకు కాళ్లకూ పెట్టాలా?... నన్ను బాత్‌రూమ్‌కు ఎత్తుకుని తీసుకుపోవాలా?... ఇంట్లో మూడో మనిషి లేదు కాబట్టి వంటమీరే చేయాలా?- నేను గోరింటాకు పెట్టుక్కూర్చుంటే... ఇంట్లో పనులన్నీ మీరు కాకపోతే ఎవరు చేస్తారు?'- తాషామరపా వాయించేసింది.

'వామ్మో నా దుంప తెంచావు కదే... ఆడంగి పన్లన్నీ నా చేత చేయించటం నాకు బొత్తిగా నచ్చలేదు...'

'మీరు మరీను... మీకు నేను... నాకు మీరు... బాధ్యత షేర్ చేసుకోక తప్పదుకదా మరి!... అన్నట్టు మరిచాను. ఇందాక పోస్ట్‌లో లెటరొకటొచ్చింది. మీ పేరుతో వుందికదాని నేనే ఓపెన్ చేశాను. మా నాన్న లెటర్ వ్రాశాడండి. లెటర్‌తో పాటు లారీ రసీదు కూడా పంపించాడు!...'

'రసీదేమిటే?' అన్నాను విస్తుపోయి

'అదేనండీ... రెండు జాడీల గోంగూర పెట్టించి వాటిని పార్సిల్ చేసి లారీ ట్రాన్స్‌పోర్ట్‌లో పంపుతున్నట్టు లెటర్లో వ్రాశారు నాన్న.. చదవండి! మీకే బోధపడుతుంది...'

'సరే... సరే... తర్వాత చదివేడుస్తాలే!... ముందు తిండి తినటం పూర్తి కానీ........ చూడూ!- కాస్తంత కందిపచ్చడి వడ్డించూ.

'ఏమిటా కలపటం? కోడి కెలికినట్టు! చేత్తో పచ్చడి అన్నం పిసకాలి... చారెడు నెయ్యి వడ్డించుకుని ముద్దలు చేసి దిట్టంగ కడపునిండా తినాలి! అప్పుడు గానీ వళ్లు చేసి మినమినలాడరు. మీరలా పిట్ట తిండి తింటే... పని చేయను శక్తేముంటుంది?-' కంది పచ్చడి వడ్డించి నెయ్యి కంచంలో మిల్లితో కాకుండా గిన్నెలో వున్నదంతా దిమ్మరించింది.

'ఒసేవ్... ఒసేవ్! ఇలా తింటే వంట్లో కొలెస్ట్రాల్ పెరుగుతుందే... ఆ తర్వాత గుండె జబ్బు వచ్చేస్తుంది. నేను కాస్తా ఠపీమంటే నువ్వు గోరింటాకు పెట్టుకునే యోగ్యత వుండదే...'

'అట్లామాట్లాడకండి... అరిష్టం! కమ్మగ కడుపు నిండా భోజనం చేయాల్సిందే! ఇప్పుడు తినకపోతే.. ముసాలాళ్లం అయినాక తినగలమా..? - ఇంద ఈ గడ్డ పెరుగు

అన్నంలో కలుపుకోండి! లొట్టలేసుకుంటూ తినండి...'

నా తిండిపూర్తి అయింది. నా ఎంగిలి కంచంలోనే అది భోజనం చేయటం చూచి' ఇదేం పాతివ్రత్యమే? మరో కంచంలో నాతో పాటే తినవచ్చుగా..'

'మీకేం తెలీదు. మీరూర్కోండి! నా భోజనం అయ్యేలోగా మీరు టీపాయ్ మీదున్న లెటరు... అదే ఇందాక చెప్పానే మా నాన్న రాసింది.... దాన్ని అక్షరం పొల్లు పోకుండా చదవండి! ఆర్డరు జారీ చేసినట్టు మాట్లాడింది తాయారు.

× × × × ×

ఆఫీసుకొచ్చి సీట్లో కూర్చుని వర్క్ చేయటం మొదలుపెట్టి గంటయినా కాలేదు... ఇంతలో ఫోనొచ్చిందంటూ బాస్ కేబిన్‌లోంచి పిలుపు.

వర్కు డిస్టర్బ్ అయినందుకు విసుక్కుంటూ సీట్లోంచి లేచివెళ్లి రిసీవర్ అందుకున్నాను.

'అబ్బాయ్ పరంధాముడూ!... మీ ఆవిడ వాంతులు విరోచనాలతో మెలికలు తిరిగి పోతుంటేనూ.... మనింటి చివరన వున్న నర్సింగ్ హోంలో ఎడ్మిట్ చేయాల్సి వచ్చింది. నువ్వు వెంటనే వున్న పళంగా బయల్దేరిరా...' రిసీవర్ పెట్టేసింది పక్కింటి పిన్ని గారు.

బాస్‌ను పరిమిషన్ అడిగి స్కూటర్ మీద రఁయ్‌న బయల్దేరాను. ట్రాఫిక్ సిగ్నల్స్ గోలతో నర్సింగ్ హోమ్ చేరటానికి గంట పట్టింది.

స్కూటర్ స్టాండ్ వేసి లాక్ చేసి లోపలికి పరగుపెట్టాను.

'బాబూ... అమ్మాయి ఇక్కడుంది బెడ్ మీద...' నన్ను చూచి బిగ్గరగా కేకేసి చెప్పింది.

నన్ను చూస్తూ 'కంగారు పడకండి! ప్రాణాపాయం ఏమీ లేదు... స్టమక్ వాష్ చేయించి సెలైన్ ఎక్కిస్తున్నారు...' హీనస్వరంతో అది తాయారు.

'వాంతులేంటి తాయారు? అసలేం జరిగింది?-' బెడ్ దగ్గరగా నిలబడి ముఖంలో ముఖంపెట్టి వంగి అడిగాను.

'ఓ చిన్న పొరపాటు జరిగిపోయింది. మీరు ఆఫీసుకెళ్లగానే నేనూ తిందామని కంచంలో భోజనం వడ్డించుకుని...' చెప్తూ ఆగింది

'ఆఁ...! వడ్డించుకుని?-'

'గోంగూర పచ్చడి అనుకుని.... పక్క గిన్నెలో వున్న గోరింటాకు అన్నంలో కలుపుకుని తిన్నాను పొరపాటున... రెండూ ఒకే కలర్లో వుండటంతో గమనించలేదు.... సారీ అండీ...' అంది.

'ఇకపై ఆ రెండూమానెయ్. అప్పుడు ఇలాంటి పొరపాటే మళ్లీ జరగదు...' అన్నాను.

సిగ్గుతో ముఖాన్ని పక్కకు తిప్పుకుంది తాయారు.

(సమాప్తం)

(ఆంధ్రప్రదేశ్ - మాసపత్రికలో ప్రచురితం)